క్లుప్తంగా

వితరణ

బొబ్బిలి: పట్టణంలోని పలువురు నిరుపేదలకు పట్టణానికి చెందిన హ్యాండ్ ఇన్ హ్యాండ్ అనాథ ఆశ్రమ నిర్వాహకులు కె.విజయబాబు ఆధ్వర్యంలో 10 కిలోల బియ్యం చొప్పున సోమవారం వితరణ చేశారు. పేదలకు తమ వంతు సాయం చేయడం చాలా ఆనందంగా ఉందని ఆశ్రమ నిర్వాహకులు అన్నారు.

ఆరోగ్య తనిఖీలు



గర్భిణుల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న వైద్యులు

రేగిడి: మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు తనిఖీలు సోమవారం నిర్వహించారు. వైద్యాధికారులు చలమయ్య, రీనాచౌదరిలు వేసవికాలంలో గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వేసవి ఎండలు విపరీతంగా ఉన్నందున వీలైనంత వరకు ఇంటి వద్దనే ఉండాలని తెలిపారు. అప్పుడే ఆరోగ్యం బాగుంటుందన్నారు. అలాగే ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఫారంపాండ్‌లతో భూగర్భ జలాల పరిరక్షణ



ఫారంపాండ్‌ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా చేపడుతున్న ఫారంపాండ్‌ల నిర్మాణంతో భూగర్భ జలాలను పరిరక్షించుకోవచ్చని ఏపీవో ఎస్.హరనాథరావు అన్నారు. మండలంలోని కొర్లవలస గ్రామంలో జరుగుతున్న ఫారం పాండ్‌ల నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. రైతులంతా పొలాలు, జీడి మామిడి తోటల్లో ఫారంపాండ్‌లు తీసుకోవాలని, తోటలు, కూరగాయల సాగుకు వీటిల్లోని నీరు ఉపయోగపడుతుందన్నారు.

అన్ని రికార్డులు నిర్వహించాలి



సీతంపేట పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రికార్డులు నిర్వహించాలని ఎంఈవో యాగాటి దుర్గారావు సూచించారు. మండలంలోని ఆగూరు, సీతంపేట, అమరాం తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించి, ఆయా పాఠశాలల రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) ఆధారంగా విద్యాబోధన చేయాలని, చదువులో వెనబడిన విద్యార్థి విద్యాప్రగతికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం సమావేశమైన ఆయన.. ఈ నెల 15వ తేదీన మండల సర్వసభ్య సమావేశం జరగనుందని, ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని అధికారులకు తెలిపారు. సభ దృష్టికి తీసుకువచ్చే అంశాలకు సంబంధించి, ఇంప్లీడ్ కాపీని మంగళవారం కార్యాలయానికి సమర్పించాలన్నారు.

యువత పోరుకు తరలిరండి

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పిలుపు

రాజాం:

కూటమి ప్రభుత్వ హయాంలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన చేపట్టబోయే యువత పోరు కార్యక్రమానికి అందరూ తరలిరావాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద యువత పోరు కార్యక్రమానికి సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే ఇంటికో ఉద్యోగం ఇస్తామని యువతను, ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగులను, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని విద్యార్థులను నమ్మబలికి ఓట్లు వేయించుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి ఇచ్చిన ఏ హామీ ఇంతవరకు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై గళమెత్తాల్సిన సమయం ఆసన్నమైందని, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, రేగిడి వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, పాలవలస దవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలు..

వంగర: ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ మోసపూరితమేనని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ విమర్శించారు. ఇదే విషయమై మండలంలోని తలగాం గ్రామంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులకు.. ఎన్నికల హామీలకు పొంతన లేదన్నారు. హామీలు ఇచ్చినప్పుడు వాటిని అమలు చేసేందుకు ఇంత బడ్జెట్ అవుతుందని, రాష్ట్ర బడ్జెట్ ఇంత అని ఆ మాత్రం అవగాహన లేకుండా హామీలు ఇచ్చేశారా అని ధ్వజమెత్తారు. ఇప్పుడు హామీలు అమలు చేయాలని చూస్తుంటే రాష్ట్ర గల్లా పెట్టె ఖాళీగా ఉందని తెలిగ్గా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అన్నివర్గాల ప్రజలను చంద్రబాబు సర్కారు మోసం చేస్తోందని, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని నెహ్రూ యువకేంద్రం వద్ద యువత పోరు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. మున్సిపల్ పార్కు నుంచి కలెక్టరు కార్యాలయం వరకు జరిగే ర్యాలీలో పెద్దఎత్తున యువత, విద్యార్థులు, నిరుద్యోగులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, సర్పంచ్‌లు పోలిరెడ్డి రమేష్, యలకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కిమిడి సన్యాసినాయుడు, పాలవలస దవళేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, యలకల వాసునాయుడు తదితరులున్నారు.



బొబ్బిలి: యువత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు



రాజాం: వాల్‌పోస్టర్ ఆవిష్కరించి, యువత పోరు కార్యక్రమానికి తరలిరావాలని కోరుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రాజేష్

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను, ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగ యువతను చంద్రబాబు సర్కారు మోసం చేస్తోందని, దీనిపై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగే ఈ కార్యక్రమానికి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, నిరుద్యోగులు, యువత అంతా హాజరుకావాలన్నారు. అదేరోజు జరిగే పార్టీ ఆవిర్భావ సభకు కూడా పార్టీ శ్రేణులంతా రావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పార్టీ సీనియర్ నాయకులు టి.భాస్కరరావు, ఎస్.వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

రాజాం సిటీ: పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం వెళ్లి, ఎంపీడీవో వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో క్షణం తీరిక లేకుండా పోతోందని, లేనిపోని సర్వేల పేరిట తమను తీవ్రమైన పని ఒత్తిడిలోకి నెట్టివేయడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సెలవులను కూడా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులతో మాట్లాడి పని భారం తగ్గేలా చూడాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.దిలీప్‌కుమార్, మండల అధ్యక్షుడు జి.అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు సావిత్రమ్మ, కార్యదర్శి కె.సీతారాం, కోశాధికారి రాము తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: సచివాలయ కార్యదర్శులపై పని భారం తగ్గించాలని మండల సచివాలయ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు పార్థసారథి డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన సచివాలయ కార్యదర్శులతో కలిసి మండల కేంద్రానికి వెళ్లి, ఎంపీడీవో రత్నంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, ఎస్.వెంకటరావు, యు.శ్రావణ్‌కుమార్, జె.సన్యాసమ్మ, పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



రాజాం సిటీ: ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



రామభద్రపురం: ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ కార్యదర్శులు

పెట్టుబడి సాయం అందించి, ఆదుకోవాలి



రైతుకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.30,000 వేలు ఇచ్చి ఆదుకోవాలని జిల్లా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన పలువురు రైతులతో కలిసి బొబ్బిలి తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులకు రుణ విముక్తి కలిగించాలని, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగించొద్దని, ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను 90 శాతం సబ్సిడీపై అందివ్వాలని, పంటలకు ఉచిత బీమా సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అనంతరం రెవెన్యూ డీటీ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. –బొబ్బిలిరూరల్

తాగునీరు వృథా.. ప్రజలకు వ్యథ!

బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని చీపురుపల్లి వీధిలో తాగునీటి పైపులైన్‌కు పడిన లీకేజీ కారణంగా తాగునీరు వృథా అవుతోంది. ఆ పైపు ద్వారా బయటకు వచ్చిన నీటితో అక్కడి రోడ్డు అంతా తడిసిపోగా ఆ వైపుగా ప్రయాణించే వారు కాస్త ఇబ్బంది పడ్డారు. అసలే.. వేసవి.. తాగునీరు దొరక్క చాలాచోట్ల ప్రజలు అవస్థలు పడుతుంటే ఇక్కడ మాత్రం పైపులైన్ లీకేజీని నిర్లక్ష్యంగా వదిలేశారని, నీరు వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి లీకేజీలతోనే కొన్నిచోట్ల కుళాయిల ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, దీంతో కొంతమందికి నీరు దొరకడం లేదని అంటున్నారు. –బొబ్బిలి



పని ఒత్తిడి తగ్గించాలి



పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై తెర్లాం మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం వెళ్లి, ఎంపీడీవో రేగి రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అధికమైన పంచాయతీల్లో పనులు, సర్వేలతో తీవ్రమైన ఒత్తిడికి గురై అనారోగ్యం బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై ఉన్న పనిభారం తగ్గించేలా ఉన్నతాధికారులతో మాట్లాడి, చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా నాయకుడు ఎం.ఎ.స్వామి, పంచాయతీ కార్యదర్శులు మధు, మల్లిఖార్జున, వినోద్, నాగభూషణ్, హరి తదితరులు పాల్గొన్నారు. –తెర్లాం

ఆధ్యాత్మిక సందడి

గ్రామదేవతల పండగలు, సంబరాలు, జాతర మహోత్సవాలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. రాజాంలో జరిగే పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు జనం పోటెత్తారు. ఉదయం నుంచే ఆలయం వద్దకు బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, విశేష పూజలు చేశారు. రాజాం మండలంలోని కొత్తవలస గ్రామంలో అయితే గంగమ్మతల్లి సంబరాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. అమ్మవారికి ప్రీతిపాత్రమైన అరటిగెలలను భక్తులు నైవేద్యంగా సమర్పించారు. తెర్లాం మండలం, కొల్లివలస గ్రామంలో గ్రామదేవత పండగలో అమ్మవారి ఘటాల తిరువీధి చేపట్టారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రాజాం పోలిపల్లి పైడితల్లి జాతరలో అమ్మవారి చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు



రాజాం సిటీ: కొత్తవలసలో గంగమ్మతల్లి సంబరాల్లో అమ్మవారికి నైవేద్యంగా భక్తులు సమర్పించిన అరటిగెలలు



బొబ్బిలి కంచర వీధిలోని వేంకటేశ్వరుని ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవం చేస్తున్న అర్చకులు



బొబ్బిలి: గొల్లపల్లి దాడితల్లి ఆలయంలోకి అమ్మవారిని తోడ్కొని వస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే

వంగర: తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. దళిత బహుజన జేఏసీ నేతలంతా కార్యక్రమానికి హాజరైన సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం నవ సమాజ నిర్మాణానికి ఆమె చేసిన కృషిని కొనియాడారు. మహిళా విద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. ఆమె గొప్ప సంఘసంస్కర్త అని, ఆమెను స్ఫూర్తిగా తీసుకుని, ఆదర్శంతమైన సమజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గణపతి, గంగులు, సింహాచలం పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత బహుజన జేఏసీ నేతలు

ఏకపాత్రాభినయ పోటీల విజేత కుమారి

రాజాం సిటీ: పోలిపల్లి పైడితల్లి జాతర సందర్భంగా ఎస్వీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక పట్టణంలో నిర్వహించిన మహిళల ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్రాభినయం పోటీల విజేతలను సోమవారం రాత్రి ప్రకటించారు. ఈ పోటీల్లో 12 మంది పాల్గొని, పోటాపోటీగా ప్రదర్శనలు ఇచ్చారు. వీరిలో రాజాంకు చెందిన బండి కుమారి.. హరిశ్చంద్ర నాటకంలోని కాటిసీను ఏకపాత్రాభినయనానికిగాను ప్రథమ స్థానం కైవసం చేసుకోగా అరణ్య సీనుకు సంబంధించి వీరఘట్టంకు చెందిన చింతాడ గోవిందమ్మ ద్వితీయ స్థానం, కాటి సీనుకు సంబంధించి శ్రీకాకుళంకు చెందిన బి.దుర్గాకల్యాణి తృతీయస్థానం దక్కించుకున్నారు. వీరికి వరుసగా రూ.6 వేలు, 5 వేలు, 4 వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్, ఆర్నిపల్లి వెంకటినాయుడు, సలాది మహేష్, పెంకి చైతన్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

పరామర్శ

వంగర: మండలంలోని తలగాం గ్రామ వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు మాతృమూర్తి కిమిడి అమ్మడమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం ఆ గ్రామానికి వెళ్లి, ఉమామహేశ్వరరావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అనంతరం అమ్మడమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వంగర, వీరఘట్టం ఎంపీపీలు ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, దమలపాటి వెంకటరమణ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, సర్పంచ్‌లు పోలిరెడ్డి రమేష్, యలకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కిమిడి సన్యాసినాయుడు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

జాతరలో పారిశుధ్య పనులు

రాజాం: బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి జాతరలో పారిశుధ్య పనులు సోమవారం చేపట్టారు. జాతరకు వచ్చిన భక్తులు వాడిపడేసిన వాటర్‌బాటిళ్లు, ప్యాకెట్లు, సంచులు, ఇతర వ్యర్థాలను ఏరివేసి, డంపింగ్‌యార్డుకు తరలించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్ పర్యవేక్షణలో నాలుగు శానిటేషన్ బృందాలు ఈ పారిశుధ్య పనులు చేపడుతున్నాయి.



ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారాన్ని ఏరివేస్తున్న పారిశుధ్య కార్మికులు

అన్నదానం

రేగిడి: స్థానిక పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)కి వైద్య తనిఖీల నిమిత్తం సోమవారం విచ్చేసిన గర్భిణులకు సత్యసాయి భక్తులు అన్నదానం చేశారు. 150 మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార విలువలతో కూడిన ఆహారం పెట్టామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు మామిడి శివప్రసాద్, లావేటి విష్ణు, లావేటి భూలోకలు పాల్గొన్నారు.



గర్భిణులకు భోజనాలు వడ్డిస్తున్న సత్యసాయి భక్తులు

జాతరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు

రామభద్రపురం: శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని, విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కె.నారాయణరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ జ్ఞానప్రసాద్‌తో కలిసి పోలీస్ సిబ్బందితో సోమవారం సమావేశమైన ఆయన.. పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలో చిన్నమ్మతల్లి జాతర మహోత్సవంలో భాగంగా జరిగే ఘటాల తిరువీధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. భక్తులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరిగేలా 70 నుంచి 80 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మెనూ అమలు చేయకుంటే చర్యలు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా అమలు చేయకపోతే చర్యలు తప్పవని ఎంఈవో త్రినాధరావు హెచ్చరించారు. మండలంలోని జనార్దనవలస గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం వంటకాలు తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందివ్వడంతో పాటు రుచి, శుచి కలిగిన భోజనం వండిపెట్టాలని సిబ్బందికి తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని,వేసవి నేపథ్యంలో విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు.

పింఛన్ ఇప్పించండి 'బాబూ'



ఎంపీడీఓ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వితంతు మహిళలు

బొబ్బిలిరూరల్: ఇంటి దిక్కును కోల్పోయాం ... కుటుంబ పోషణకు కష్టమవుతోంది... తక్షణమే అర్హతలు పరిశీలించి పింఛన్లు మంజూరు చేయాలంటూ పలువురు వితంతువులు ఎంపీడీఓ పి.రవి కుమార్‌కు విన్నవించారు. భర్త చనిపోయి నెలలు గడుస్తున్నా పింఛన్ రాలేదని కమ్మవలస గ్రామానికి చెందిన రాపాక సాయమ్మ, పిల్లా అప్పలనర్సమ్మ, సత్తెమ్మ, చప్ప మహాలక్ష్మి, సింహాచలమమ్మ, చింతల పార్వతి వాపోయారు. పింఛన్‌దారుల కష్టాలను సర్పంచ్ పిల్లా వసుంధర ఎంపీడీఓకు వివరించారు.